క్లుప్తంగా

పెద్దమ్మ ఆలయాభివృద్ధికి విరాళం



నగదు అందజేస్తున్న దాత కొమ్మిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన శ్రీ పెద్దమ్మ ఆలయాభివృద్ధికి బుధవారం సంజామల మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి నారాయణరెడ్డి, ఆయన సతీమణి రామతులశమ్మ రూ.25,020 విరాళంగా అందజేశారు. ఈ మేర కు దాతలు నగదును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలను సభ్యులు సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

లంపీ స్కీన్ వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఆవుకు టీకాలు వేస్తున్న డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: లంపీ స్కీన్ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి రామ్‌కుమారెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని ఆవులు ఉన్న రైతుల వద్దకు వెళ్లి లంపీ స్కీన్(ముద్దచర్మం) వ్యాధి నిరోధక టీకాలను ఆయన పశువులకు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ లంపీ స్కీన్‌వ్యాధి సోకిన పశువుల చర్మం మీద దద్దుర్లు ఏర్పడి జ్వరంతో మేత నీరు తీసుకోవన్నారు. ఈలక్షణాలు కనబడిన వెంటనే యజమానులు పశువైద్య సిబ్బందిని సంప్రదించి టీకాలను వేయించాలని సూచించారు. పశువైద్య సిబ్బంది ఖురేషి, ముక్తియార్, జయరామ్ నాయక్, నీలకంఠ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఘాట్‌ను పరిశీలించిన చైర్మన్



వినాయకఘాట్‌ను పరిశీలిస్తున్న నగర పంచాయితీ చైర్మన్, కేంద్ర గణేష్ కమిటీ సభ్యులు

బేతంచెర్ల: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పట్టణంలో ఈనెల 18న కొలువయ్యే వినాయక విగ్రహాలను 21 నిమజ్జనం చేయడానికి అయ్యల చెర్వులోని వినాయక ఘాట్‌ను బుధవారం నగర పంచాయితీ చైర్మన్ చలం రెడ్డి, కేంద్రగ ణేష్ కమిటీ సభ్యులు పరిశీలించారు. నీటి సౌకర్య, వసతుల కల్పనపై కమిషనర్ రమేష్ బాబు, గణేష్ కమిటీ సభ్యులతో చర్చించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, చెరువును నీటితో నింపుతామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర గణేష్ కమిటీ సభ్యులు హుసేన్ రెడ్డి, సుబ్బారెడ్డి, బూషిరెడ్డి, మురళీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



వంటగది నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని రోకలబండ సత్రం ప్రభుత్వ పాఠశాలలో రూ.5లక్షలతో చేపట్టిన వంటగది నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలన్నింటిలోనూ వంట గది, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉండే విధంగా చూడాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశించారన్నారు. నెలలోపు వంటగది నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్, సచివాలయ అమ్యూనిటీస్ దుర్గా తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాల్వలోకి దిగిన ఆర్టీసీ బస్ చక్రాలు

కోవెలకుంట్ల: పట్టణంలో బుధవారం ఆర్టీసీ బస్సు డ్రైనేజీ కాల్వలోకి దిగింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి జమ్మలమడుగు చౌరస్తా వరకు సీసీరోడ్డు, డివైడర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలను పాండురంగ స్వామి దేవాలయం మీదుగా మళ్లించారు. కోవెలకుంట్ల నుంచి జమ్మలమడుగుకు వెళ్తుండగా రంగరాజుపేట సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనానికి ఆర్టీసీ బస్సు డ్రైవర్ సైడ్ ఇచ్చారు. ఈ క్రమంలో డ్రైనేజీ కాల్వలోకి ఆర్టీసీ బస్సు చక్రాలు దిగిపోయాయి. దీంతో దాదాపు గంటసేపు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు చొరవతో కాల్వలో ఇరుక్కున్న బస్‌ను లాగడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి.



బెలుంలో గీతామందిరంలో పూజలు చేస్తున్న భక్తులు.



కృష్ణాష్టమి వేడకల్లో భాగంగా నృత్యం చేస్తున్న చిన్నారులు



శ్రీకృష్ణుడిని దర్శించుకున్న భక్తులు



శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

డోన్ టౌన్ : కృష్ణాష్టమి వేడుకలను బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పాతబస్టాండ్‌లో ప్రభోద సేవా సమితి కమిటీ ఆధ్వర్యంలో మండపం ఏర్పాటు చేసి శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట మీట్ కార్పొరేషన్ చైర్మెన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో...

శ్రీ క్రిష్ణ జన్మాష్టమిని పురష్కరించుకుని డోన్ మండల యాదవసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న శ్రీక్రిష్ణుని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు.

వేంకటేశ్వర ఆలయంలో...

పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కృష్ణాష్టమిని పురష్కరించుకొని ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరించిన శ్రీకృష్ణుడి విగ్రహం ఆకట్టుకుంది. మహిళా భక్తులు సహస్రనామావలి పఠనం చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. పాతబస్టాండ్, ప్రభుత్వ ఐటీఐ వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్యాపిలి: మండల ప్రజలు బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడి సమీపంలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము తదితరులు శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కేశవులు, రమణ, రామాంజి, రాఘవ, హరికృష్ణ, సురేశ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న ఉట్టి కొట్టే కార్యక్రమం

స్థానిక సరస్వతి శిశు మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారుల చిన్నికృష్ణుడు, గోపికల వేశధారణ ఆకట్టుకుంది. పాఠశాల ప్రాంగణంతో పాటు పట్టణ ప్రధాన కూడళ్లలో నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది.

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల రహదారిలోని గోపాల కృష్ణ బృందావనంలో మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు తోపాటు ఆలయ కమిటీ సభ్యులు గూని నాగరాజు, మద్దిలేటి, వెంకట్, పద్మనాభుడు పూజలు చేశారు. పూదోట మఠం, అమ్మవారిశాల వెలసిన శ్రీకృష్ణుడికి భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సిమెంట్ నగర్ గ్రామమీపాన క్రిష్ణమ్మ కొనలో వెలసిన రుక్మిణి,సత్యభామ సమేత శ్రీకృష్ణుడుకి అర్చకుడు కిట్టయ్య, కందికాయపల్లె సర్పంచ్ రామచంద్రుడు, దస్తగిరి ఆధ్వర్యంలో అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు.



సిమెంట్ నగర్ సమీపాన క్రిష్ణమ్మ కొనలో కృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆంజనేయ స్వామి ఆలయం వద్ద స్తంభం పాకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఎస్ఎల్‌వీటీ సినిమా థియేటర్ సమీపంలో పట్టణానికి చెందిన ప్రభోదానంద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజులపాటు జరిగే వేడుకల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, సుధీర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 14 తేదీన శ్రీకృష్ణుని విగ్రహానికి ఊరేగింపు కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రభోదా సేవాసమితి కోవెలకుంట్ల అధ్యక్షుడు జనార్ధన పేర్కొన్నారు. కృష్ణాష్టమిని పురష్కరించుకుని చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలు అలరించారు. కార్యక్రమంలో ప్రభోదా సేవా సమితి ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, రామసుబ్బారెడ్డి, సభ్యులు మధుసూదన, సుబ్బారావు, సుధాకర్, చౌడయ్య, వెంకటరమణ, రామసుబ్బయ్య, లీలావతి, ఆదిలక్ష్మి, సుగుణ, సుశీల, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ కృష్ణుడు

సంజామల: మండల కేంద్రం సంజామలతో పాటు గ్రామల్లో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుని విగ్రహానికి పూలమాలలు వేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

అవుకు: మండల కేంద్రం అవుకుతోపాటు గ్రామాల్లో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మార్కెట్ ఏరియాలోని వేపచెట్టు కింద ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. శ్రీకృష్ణ దేవాలయంలో యాదవులు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. అవుకు సొసైటీ చైర్మన్ చల్లా విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రామాపురంలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు.

కొలిమిగుండ్ల: శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా మండలంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు శ్రీకృష్ణుడి వేషారణ వేయించి అడుగులు వేయించారు. బెలుంలోని గీతామందిరంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక పల్లకీలో స్వామిని గ్రామంలోని వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. కొలిమిగుండ్లకు చెందిన భక్త బృందం గీతాపారాయణం పఠించారు. చిన్నారులతో ఉట్టికొట్టే కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది.

తొలగిన రహదారి కష్టాలు

- గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసానికి విన్నవించిన సమస్య పరిష్కారం
- అమడాలలో కల్వర్టు నిర్మాణం పూర్తి
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామంలో ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి కష్టాలు కల్వర్టు నిర్మాణంతో తొలగిపోయాయి. గ్రామ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో వాగు ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలు సమస్యను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కల్వర్టు, సీసీరోడ్డు నిర్మాణానికి రూ. 30 లక్షల నిధులు మంజూరు చేయించారు. సర్పంచ్ బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకరయ్య ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి రూ. 20 లక్షలతో కల్వర్టు పనులు పూర్తి చేశారు. మరో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కల్వర్టు ఏర్పాటుతో ఏళ్లతరబడి పడిన ఇబ్బందులు తొలగాయి. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



రూ. 20 లక్షలతో నిర్మించిన కల్వర్టు

ప్యాపిలిలో నిషేధం కొనసాగింపు

ప్యాపిలి: మండల కేంద్రం ప్యాపిలిలో వినాయక చవితి వేడుకలపై నిషేధం ఈయేడూ కొనసాగనుంది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం 2003లో గణేశ్ నిమజ్జనం సందర్భంగా జరిగిన అల్లర్ల నేపథ్యంలో వేడుకలపై అధికారులు నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఆ సంవత్సరం ఎస్సీ కాలనీలోని విగ్రహం గ్రామంలోకి రావడాన్ని అగ్రవర్ణాల ప్రజలు అడ్డుకున్న నేపథ్యంలో ఘర్షణలకు దారి తీసింది. ఇరు వర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలపై కూడా ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. దీంతో ఎస్పీ స్వయంగా కాల్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. కర్ఫ్యూ ప్రకటించాక ఘర్షణలు అదుపులోకి వచ్చాయి. దాదాపు 187 మందిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశారు. దాదాపు ఆరు సంవత్సరాల తర్వాత ఈ కేసు కొట్టివేయబడింది. ఈయేడు ఉత్సవాలు నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కొందరు స్పందనలో అధికారులకు విన్నవించినా ఫలితం కలుగలేదు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు నిషేధం కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొందని సీఐ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర వర్మ తెలిపారు. ఈయేడు కూడా చిన్న పిల్లలు చందాలు వేసుకుని చిన్న మంటపాలలో నెలకొల్పిన బుల్లి వినాయకులను పెద్దలు సైతం దర్శించుకుని సరిపెట్టుకోవాల్సిందే.



చల్లా ఫామ్ హౌస్‌లో నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, అభిమానులు

చల్లాకు నివాళి

అవుకు: దివంగత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. చల్లా ఫామ్‌హౌస్‌లోని ఆయన సమాధికి కుమారుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, అవుకు సొసైటీ చైర్మన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి, నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో చల్లా హిమకర్ రెడ్డి, చల్లా ప్రణవ్‌నాథ్ రెడ్డి, చల్లా అభిమానులు పాల్గొన్నారు.

- అలాగే అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ చల్లా సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చల్లా చైతన్యరెడ్డి, చల్లా చరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు చోటు చేసుకోరాదు

నంద్యాలటౌన్: మాతా శిశు మరణాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణుల ప్రసవ ప్రణాళికను రూపొందించి వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం అయ్యేలా చూడాలని చెప్పారు. అలాగే శిశులకు వ్యాక్సిన్‌లు సకాలంలో వేసి వివరాలు నమోదు చేయాలన్నారు. ఆశా, ఏఎస్ఎంలకు కేటాయించిన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, 5 ఏండ్ల లోపు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ఎఫ్‌ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలని సూచించారు. పరిపాలన అధికారి డాక్టర్ చంద్రశేఖర్, కుటుంబ వైద్య విధాన నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్ చంద్ర, డాక్టర్లు శ్రీమంత్, కాంతారావు, ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డోన్ - పత్తికొండ బస్సు సర్వీసు ప్రారంభం

డోన్ : రహదారి సౌకర్యాలు మెరుగుపడినందున ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించినట్లు రాష్ట మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్‌లు తెలిపారు. బుధవారం డోన్ - పత్తికొండ నూతన బస్సు సర్వీసును మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడుతో కలిసి వారు ప్రారంభించారు. గతంలో డోన్ నుండి చంద్రపల్లె మీదుగా తాడిపత్రి వరకు బస్సు సర్వీసును ప్రారంభించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ప్రజలందరూ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆర్ఎం శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్యాల భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటనాయునిపల్లె రాజు, రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి శీలం భాస్కర్‌నాయుడు, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బుగ్గన చొరవతో అదనపు బస్సులు ఏర్పాటు

బేతంచెర్ల: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో మండలానికి అదనపు బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి బుధవారం తెలిపారు. నంద్యాల నుంచి బేతంచెర్ల వరకు ప్రస్తుతం ఉన్న బస్సులతో పాటు సాయంత్రం 8 గంటలకు అదనంగా బస్సు, ప్రతి శుక్ర, శనివారాల్లో డోన్, బనగానపల్లె డిపోల నుంచి వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి బస్సు సౌకర్యం, నంద్యాల నుంచి బేతంచెర్ల మీదుగా డోన్, ప్యాపిలీ మీదుగా పత్తి కొండకు బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. మండల కేంద్రమైన బేతంచెర్ల నుంచి వెల్దుర్తికి నిలిచిపోయిన బస్సు సర్వీసులను ఉదయం, సాయంత్రం వేలలో పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అదనపు బస్సులు ఏర్పాటు చేసినందుకు మండల ప్రజల తరపున మంత్రి బుగ్గనకు ఎంపీపీ, చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.



పత్తికొండ సర్వీసును ప్రారంభించిన దృశ్యం

అమృతవనం స్థూపం ఏర్పాటుకు మట్టిసేకరణ

కోవెలకుంట్ల: దేశ రాజధాని ఢిల్లీలో అమృత వనం స్థూపం ఏర్పాటుకు బీజేపీ ఆధ్వర్యంలో మట్టి సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న తెలిపారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలో మట్టిసేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన గొప్ప సంకల్పాన్ని పూర్తి చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, బన్ని తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటును ఢీ కొట్టిన ట్రాక్టర్

బేతంచెర్ల: పట్టణంలోని బనగానపల్లె రహదారిలోని రైల్వే గేట్‌ను బుధవారం ట్రాక్టర్ ఢీ కొట్టింది. రైలు వెళ్లాకా గేటు తీస్తుండగా బనగానపల్లె వైపు నుంచి వస్తున్న నాపరాళ్ల ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో గేటు విరిగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు రెండు గంటల పాటు అంతరాయం కలుగడంతో సంజీవనగర్, హనుమాన్ నగర్ మీదుగా బస్సుల రాకపోకలు సాగాయి. చివరకు రైల్వే సిబ్బంది గేటుకు మరమ్మతులు చేయ డంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

నేడు చంద్రబాబు బనగానపల్లెకు రాక

బనగానపల్లె: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం రాత్రి బనగానపల్లెలో మాజీ టీడీపీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఇంటి వద్ద బస చేయనున్నారు. శుక్రవారం ఉదయం అక్కడే ఏర్పాటు చేస్తున్న మహిళా శక్తి సమావేశంలో చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ మేరకు బందోబస్తు నేపథ్యంలో ఏర్పాట్లను డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మధుసూదన్‌రావు దంపతులను సన్మానిస్తున్న నాయీబ్రహ్మణ సేవా సంఘం సభ్యులు

బనగానపల్లె : స్థానిక నాయీబ్రహ్మణ కాలనీలోని శ్రీరామాలయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎం మధుసూదన్ రావు దంపతులను బుధవారం స్థానిక నాయీ బ్రహ్మణ సేవా సంఘం అధ్యక్షులు శ్రీరాములు ఆధ్వర్యంలో ఘన సన్మానించారు. సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎంఆర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, నాయకులు మధుసూదన్‌రావు దంపతులకు శాలువాలకు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలోఉపాధ్యక్షులు రామమద్దిలేటి, కార్యదర్శి మల్లికార్జున ట్రెజరర్ పీవీ శివయ్య, సభ్యులు సాయికృష్ణ, రామాంజనేయులు, రామకృష్ణయ్య మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

- అలాగే స్థానిక జమాఅతే ఇస్లామి హింద్ కార్యాలయంలో బనగానపల్లె శాఖ అధ్యక్షుడు ఎంఎం అలిబేగ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్ జిలానీ బాషాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కలీమ్, ఇక్బాల్, ఖాన్ రైస్ మిల్లు అధినేత ఇర్షాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ పోస్టర్లు విడుదల

డోన్ రూరల్ : తిరుపతిలో 8వ తేదీన సీపీఐ బస్సు యాత్ర ముగింపు సభకు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు , సిపిఐ కార్యవర్గ సభ్యులు సుంకయ్యలు పిలుపు నిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బహిరంగ సభ వాల్ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, పట్టణ కార్యదర్శి నారాయణ, రైతు సంఘం జిల్లా కన్వీనర్ నారాయణ, మహిళా సమైఖ్య జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, మండల సహాయ కార్యదర్శి వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఏపీ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి వార్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.



మల్లన్న దర్శనార్థం వస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్